క్లుప్తంగా

కొత్వాల్‌కు సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఒబేదుల్లా కొత్వాల్‌ను శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని మజీదే ఆమేనా ఆవరణలో జుమా నమాజ్ అనంతరం పలువురు ముస్లింలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మజీద్ ఖతీబ్ మౌలానా గులాం మహ్మద్, కమిటీ అధ్యక్షుడు సత్తార్, ఖాజా నయీమోద్దీన్, సలీం అడ్వకేట్, అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, అహ్మద్, ఫసిహైదర్, పాష, షేక్ మహమూద్, అసద్, ముబిన్ సోఫి, మొజిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టెంకాయల టెండర్ వాయిదా

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో టెంకాయల విక్రయానికి సంబంధించి శుక్రవారం టెండర్లు జరగాల్సి ఉండగా వాయిదాపడింది. కాగా టెంకాయల ధరలను పెంచి విక్రయిస్తామని టెండరు దారులు ఆలయ అధికారులకు వివరించారు. అయితే గతంలో ఉన్న ధరలకు మాత్రమే విక్రయించాలని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో టెండరుదారులు వెనుదిరిగారు. ఈనేపథ్యంలో మరోసారి టెండర్లు పిలుస్తామని, త్వరలోనే మరో తేదీ ప్రకటిస్తామని ఆలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



దేవరకద్ర: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెంటన్నయాదవ్, వెంకటేశ్, విజయ్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్, సురేష్, రాఘవేంద్ర, మురళి, ఇమామ్, అసిఫ్, ఖాజా, కుమ్మరిశేఖర్ తదితరులు ఉన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ సమక్షంలో శుక్రవారం బీఆర్‌ఎస్ క్రిస్టియన్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్.రవికుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకుడు రాకేష్ వడ్ల పాల్గొన్నారు.

బీజేపీలో ..

దేవరకద్ర: గూరకొండ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణ్‌కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

కులవృత్తులకు బీజేపీ అండ



దేవరకద్ర: కలవృత్తుల వారికి బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి రవికుమార్ తెలిపారు. శుక్రవారం దేవరకద్రలో జరిగిన ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ యోజన పథకం ద్వార 18 కులవృత్తులకు సహకారం లభిస్తుందన్నారు. ఈ పథకంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చిన తరువాత ఒక్కో లబ్ధిదారునికి రూ. లక్ష రుణసదుపాయం కల్పిస్తారని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, ఉపాధ్యక్షులు అమరేందర్‌రెడి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గండేడ్: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. శుక్రవారం చెన్నాయిపల్లి, గండేడ్ గ్రామాలను సందర్శించారు. నర్సరీలు పరిశీలించారు. వాటర్ ట్యాంకుల శుభ్రతపై ఆరా తీశారు. అదేవిధంగా వేసవి కారణంగా ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నర్సరీలు మొక్కడ ఎండకుండా పెంచాలని ఆయన పంచాయతీ కారదర్శులను ఆదేశించారు. పార్టీల పోస్టర్లు, జెండాలు, గోడరాతలు వంటి ఉండరాదని.. పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తపడాలన్నారు. ఆయన వెంట గండేడ్ పంచాయతీ కార్యదర్శి శశిరేఖ ఉన్నారు.



ఓటుహక్కు వినియోగించుకోండి



ఓటరు చైతన్య ర్యాలీలో ఆర్డీఓ నవీన్ తదితరులు

మహబూబ్‌నగర్ రూరల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ నవీన్ అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని నలంద ఆటోస్టాండ్, రాజేంద్రనగర్ ప్రాంతాలలో ఓటరు చైతన్య కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని అన్నారు. గతంలో తక్కువ ఓటింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

ఇంటి వద్దే ఓటుహక్కు వినియోగం

లోక్‌సభ ఎన్నికల్లో ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగానికి సంబంధించి అర్హత కలిగిన 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగ ఓటర్లకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆర్డీఓ నవీన్ సూచించారు. గతంలో ఉన్న 80 ఏళ్ల వయస్సు పరిమితిని 85 ఏళ్లకు పెంచారని తెలిపారు. ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగానికి ఈనెల 22 నుంచి ఏప్రిల్ 22 వరకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. శుక్రవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో బీఎల్ఓల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. 85 ఏళ్లు పై బడిన ఓటర్ల నుంచి ఫారం–12డీ ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఆ తర్వాత వాటిని పరిశీలించి ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు ఘన్సీరామ్, సుందర్‌రాజ్, కిష్ట్యానాయక్, డిప్యూటీ తహసీల్దార్లు దేవేందర్, సునీల్, గిర్దావర్లు నర్సింగ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి కూలీలతో అధికారులు

కోయిల్‌కొండ: ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్‌డీఓ నర్సిములు అన్నారు. శుక్రవారం మండలంలోని రాంపూర్, మల్కాపూర్, కోయిల్‌కొండ గ్రామాల్లో పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కాలప్ప, ఎంపీఓ నజీర్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని మల్లెల పాపయ్య కుంటలో పూడిక తీత పనులను జిల్లా ఉపాధి హామీ డీబీటీ లక్ష్మీనారాయణ పరిశీలించి కూలీలతో మాట్లాడారు. బిల్లులు ఎప్పటి కప్పుడు చేస్తే డబ్బులు సకాలంలో అందిస్తామన్నారు. ఏపీఓ సంజీవ్‌కుమార్, ఎఫ్ఏ వీరాంజనేయులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు ఇవ్వడం లేదు

- నేటి నుంచి ఉపాధి పనులు చేయం
- జక్లపల్లి, లింగాయిపల్లి గ్రామాల కూలీలు



జక్లపల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ హరిశ్చంద్రుడు

గండేడ్: పనులు చేసినా డబ్బులు ఇవ్వడం లేదని.. శనివారం నుంచి ఉపాధి పనులు చేయమని జక్లపల్లి, లింగాయపల్లి కూలీలు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై ధర్నా చేస్తామని.. అవసరం అయితే ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం పనులు పూర్తయ్యాక సిబ్బందికి ఫోన్ చేసి డబ్బుల గురించి నిలదీశారు. దీంతో విషయం తెలుసుకున్న ఏపీఓ హరిశ్చంద్రుడు జక్లపల్లికి చేరుకొని కూలీలతో మాట్లాడారు. జక్లపల్లిలో 65 మంది, లింగాయిపల్లిలో 45 మంది పనులకు వెళ్తున్నారని, ఏడు వారాలుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయనతో కూలీలు పేర్కొన్నారు. ఎన్నిసార్లు అడిగినా దాటవేత ధోరణీ ప్రదర్శిస్తున్నారని.. శనివారం జక్లపల్లి గేటు వద్ద ధర్నా చేస్తామన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఏపీఓ ఎంత సర్దిచెప్పినా వినిపించుకోలేదు. కాగా ఇప్పటికే ఆరు వారాల పేమెంట్ కోసం పంపించామని అవి రాగానే.. ఖాతాల్లో జమ అవుతాయని ఏపీఓ చెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

జడ్చర్ల టౌన్: ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వలేదని వెంటనే చెల్లించాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఉపాధి పర్యటన పేరుతో కొన్ని గ్రామాలను సందర్శించి ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడ్తామని హెచ్చరించారు. యాదయ్య, ఉపాధి కూలీలు పెంటయ్య, రవికిరణ్, వివేక్, వెంకటమ్మ, మణెమ్మ, జంగయ్య, భాగ్యశ్రీలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చూపిస్తాం



మాట్లాడుతున్న పాపయ్య

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పి మాదిగల సత్తా ఏమిటో చూపిద్దామని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ శాఖల అభివృద్ధి కోసం మాదిగ, మాదిగ ఉపకులాల జిల్లా సదస్సు శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించారు. దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, జిల్లా అధ్యక్షుడు ఎర్రగుంట నరేష్, ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

నవాబుపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వైపు వెళ్తుండగా టిప్పర్ పట్టుకున్నట్లు వివరించారు. కాగా పోలీసులను చూసి డ్రైవర్ పరారైనట్లు పేర్కొన్నారు. టిప్పర్ యజమాని మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అదేవిధంగా అక్రమంగా ఇసుక నిల్వ ఉంచితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్..

బాలానగర్: దుందుభీనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాజీ శుక్రవారం తెలిపారు. మేడిగడ్డ తండాకు చెందిన పాత్లావత్ శ్రీనివాస్ ఇసుకను తరలిస్తూ మోతీఘణాపూర్‌లో పట్టుబడ్డాడని వివరించారు. ఈ మేరకు యజమానిపై కేసునమోదు చేశామని.. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రహీంనగర్‌లో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు పార్టీలో చేరిన సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామంలో త్వరితగతిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పెర్కివీడులో విద్యుత్ స్తంభంపై పనిచేస్తూ.. ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కార్యకర్త రాములుని ఎమ్మెల్యే పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. బ్లాక్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, మండల అధ్యక్షుడు రవీందర్, ధన్వాడ అధ్యక్షుడు నరహరి, మాజీఎంపీపీ మహేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షల్లో చూచిరాతలు!

మిడ్జిల్: మండలంలో ఉన్న పది పరీక్ష కేంద్రాలు చూసి రాతలకు నిలయాలుగా మారాయని పలువురు విద్యార్థులు శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయులే చూచిరాతలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు... బిట్ ప్రశ్నలకు స్వయంగా జవాబులు తయారు చేసి పరీక్ష కేంద్రంలో బహిరంగంగా చెప్పుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఇలా చేయడం వల్ల కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక, కాంగ్రెస్‌కు భయపడి ఏఐసీసీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారని మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ విమర్శించారు. ఖాతాలను స్తంభింపజేయడానికి వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. యువజన అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రాఘువేందర్, పట్టణ అధ్యక్షుడు ఎండి.సల్మాన్, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, షంసోద్దీన్, నరేష్ బాబు, ఖాదర్, రఘు, బండి మల్లేష్, నాగరాజు, కిషన్‌నాయక్, చిన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల వివరాల సేకరణ



హన్వాడ: మండలపరిధిలోని కొత్తపేటలో ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రత్యేక శిబిరం కొనసాగుతోంది. అందులో భాగంగా 6వరోజు యూనిట్ బృందం శుక్రవారం గ్రామంలో 15–29 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగుల వివరాలను సేకరించారు. అదేవిధంగా ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి అవశ్యకత గురించి, ఇంకుడు గుంతలు తవ్వడం వలన భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. తదనతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రిసోర్స్‌పర్సన్ డాక్టర్ భూమయ్య మాట్లాడుతూ వలంటీర్లు సేవాభావాన్ని కలిగి ఉండాలని, జాతీయసేవా పథకం ద్వారా నిస్సహాయులకు సేవచేసే అదృష్టం ఉంటుందని వివరించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి గంగా, ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు, తిరుపతయ్య, ఎంపీటీసీ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న డీసీసీబీ ఆధ్వర్యంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అగ్రిమెంట్‌ను రెన్యూవల్ చేసి తిరిగి అగ్రిమెంట్ చేయించేలా చొరవ తీసుకోవాలని కోరారు. మైత్రి యాదయ్య, ప్రకాష్, శంకర్, సతీష్, మోహన్, రాఘవ, మల్లేష్, నాగప్ప పాల్గొన్నారు.

ముగిసిన కోటచింతల బ్రహ్మోత్సవాలు



నవాబుపేట: కోటచింతల బసవేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం రుద్రాభిషకం నిర్వహించారు. మంగళహారతితో ఉత్సవాలు ముగించారు. ఈ సందర్భంగా వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు రాజేష్, శర్మ, సిద్దయ్య, చారి, నరేందర్, మాజీ సర్పంచులు పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల



మహబూబ్‌నగర్ రూరల్: పులే– అంబేడ్కర్ 4వ జాతర కరపత్రాలను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మే 27న జాతరను పెద్దఎత్తున నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింలు, కార్యనిర్వహణ అధ్యక్షుడు మామిడి సామెల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిళ్ల రఘునాథ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని జిల్లా విద్యాధికారి రవీందర్ సూచించారు. మూసాపేట జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి, రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి మేకల జనార్దన్ ఆర్ఓ ప్లాంటును ఏర్పాటు చేయించిన సందర్భంగా డీఈఓ మాట్లాడారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం దాత జనార్దన్‌ను సత్కరించి అభినందించారు. అడ్డాకులలో గతంలో పాఠశాల కోసం దయాకర్‌రెడ్డి దానం చేసిన స్థలాన్ని తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్‌తో కలిసి డీఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓలు రాజేశ్వర్‌రెడ్డి, నాగయ్య తదితరులు ఉన్నారు.

శాలివాహనుడి జయంతి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : కుమ్మర సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తెలంగాణచౌరస్తాలో చక్రవర్తి శాలివాహన జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర కాలనీలో ఉన్న మొల్ల మాంబ విగ్రహం వద్ద శాలివాహన చక్రవర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడు నాగప్ప, మల్లేష్, నర్సప్ప, రవికుమార్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్నాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకే వార్డుల పర్యటన చేపట్టినట్టు మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ వివరించారు. శుక్రవారం 2, 5వ వార్డుల పరిధిలోని ఆయా గల్లీలను ఆయనతో పాటు మున్సిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ పరిశీలించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండడి వెంకట్‌రెడ్డి(55) గురువారం సర్వీస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. కాగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. వెంకట్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

ప్రచార కార్యదర్శిగా దుర్వాసరాజు



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య ప్రచార కార్యదర్శిగా పాలమూరుకు చెందిన వరకవుల దుర్వాసరాజు రెండోసారి ఎన్నికయ్యారు. సలహాదారులుగా రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ ఎన్నికయ్యారు. దుర్వాసరాజు మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌కు చెందిన జనతా సేవా సమితి ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 600కు పైగా పౌరాణిక, భక్తి నాటకాలను ప్రదర్శించినట్లు తెలిపారు.


నీటితోనే మానవ మనుగడ



జల సంరక్షణపై సంతకాలు సేకరిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జల సంరక్షణపై రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మానవ మనుగడకు నీరే ముఖ్యమైన వనరు అని, అది లేకపోతే మనిషి జీవితం ప్రశ్నార్థకం అన్నారు. వ్యవసాయనికి, తాగడానికి, పరిశ్రమలకు ఎంతో అవసరమయ్యే నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, కలుషితం కాకుండా, వనరులు తగ్గిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. అధ్యాపకులు లావణ్య, స్వాతి, మార్కండేయ, ప్రవీణ్‌కుమార్, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆరా..



నవాబుపేట: తాగునీటి ఎద్దడి రాకుండా సమస్యలపై మిషన్ భగీరథ అధికారులు ఆరాతీశారు. శుక్రవారం కాకర్లపహాడ్, వెంకటేశ్వరతండా, కొళ్లగుట్ట, కేశవరావుపల్లి గ్రామాల్లో పర్యటించి తాగునీటి ఇబ్బందులు తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న తాగునీటి వనరులపై దృష్టి సారించి వాటిని మరమ్మతు చేయించాలని ఆదేశించారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కాగా నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రతి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, బద్రునాయక్, ఏఈ సమీయుల్లా తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్: గ్రామాల్లో తాగునీటి వృథాను అరికట్టాలని ఇంట్రా ఏఈ మద్దిలేటి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. గ్రామంలో పలుచోట్ల లీకేజీలను పరిశీలించారు. కార్యదర్శులు గ్రామాల్లో ఎక్కడ కూడా లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నల్లాలు వృథాగా వదిలేస్తే సదరు యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథ నీటితో పాటు స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మహమ్మదాబాద్ పంచాయతీ కార్యదర్శి రాఘువేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.